
# ప్యార్ మీర్జా మహేశ్వరికా



కథ

రహమతుల్లా

ఏక్

అసర్ నమాజ్ వేళ

ఇర్ఫాన్ మీర్జా మానసిక రోగిలా ఎటో చూస్తూ బిస్తర్ మీద పడుండాడు.

నమాజ్ అయ్యాక గస్తీలో బయలుదేరిన మస్జిద్ మనుషులు మీర్జా ఇంటిముందు నిలబడి పిల్చారు.

మీర్జా బయటకు రాగానే గుంపుగా నిలబడినవారిలోనుంచి ఒక పెద్ద గడ్డపాయన "నా పేరు ఇస్మాయిల్ మౌలా. నేను ముంబాయి నుంచి వచ్చిన జమాత్‌కు అమీర్‌ను. మీరు నమాజుకు రారని మీ మస్జిదులో చెప్పారు. అందుకే మీకు మస్జిదుకు రమ్మని దావత్ ఇవ్వటానికి నేనే ప్రత్యేకంగా వచ్చాను. మీ ఇరవైనాలుగు గంటల్లో ఒక్కగంట ఆ ఖుదా కొరకు వెచ్చించండి. రోజులో ఐదు నమాజులు. ఇరవై రకాతులు. ఫజర్, జొహర్, అసర్, మగరిబ్, ఇషా. పొద్దు ముందు, నడినెత్తి పొద్దు, పొద్దుకుంగాక, పొద్దుపోయాక, రాత్రి. దినం మొత్తంలో ఏ నిమిషం కూడ ఒత్తిడి సైతాను మీ దరిచేరని ఏర్పాటు. మీ మనస్సుకు భావాతీతమైన సంతృప్తి, శరీరానికి సంపూర్ణమైన ఆరోగ్యం. కామం క్రోధం విరహం భయం లాంటి ఎన్నో మానసిక సమస్యలకు నమాజ్ మహాద్భుతమైన లేపనం. ఇంకా ఇటువంటి ఎన్నో విషయాలను మాట్లాడుకోవటానికి మేము మీ షహర్‌కు వచ్చాం. మగరిబ్‌కు మస్జిదుకు వస్తే మాకెంతో సంతోషం" అని చెప్పేసి ఇస్మాయిల్‌జీ అక్కడ్నించి కదిలాడు. గుంపు పక్కింటి గడప ముందుకు వెళ్ళి నిలబడింది.

మీర్జా మస్జిదు మనిషి కాడు. కాని అత నిల్లు మస్జిదుకు కూతవేటు దూరంలో ఉంటుంది. అందుకని మస్జిదుకు వచ్చిన జమాతులన్నీ దాదాపుగా 'గస్తీ'తో మీర్జా ఇంటికి వస్తుంటారు. ఓ అరడజను మంది గుంపుగా నిలబడి మస్జిద్‌కు రమ్మని దావత్ ఇచ్చిపోతుంటరు. మీర్జా తల ఆడిస్తూ నిలబడ్తాడు. వాళ్ళు పదినిమిషాలు గుసగుసగా మాట్లాడి వెళ్ళిపోతారు. హమ్మయ్య అనుకుని ఇంట్లో పడి వెంటనే వాళ్ళను మరచిపోతాడు. కాని ఈసారి అలా జరగలేదు. ఇస్మాయిల్‌లా ఇంతదాకా ఎవరూ మాట్లాడలేదు. ఎవరు మాట్లాడినా ఒకేవిధంగా ఉండేది.

"ఈ జీవితం మహా అయితే అరవై డెభై సంవత్సరాలు. అంటే చాలాచాలా చిన్నది. చనిపోయాక ఉండే జీవితం శాశ్వతం. అంటే వేలవేల సంవత్సరాలు. ఆ జీవితం స్వర్గంలో గడిపే అర్హత పొందటానికి ఈ జీవితం ఒక ఇంతెహాన్. అది నెగ్గటానికి ఏకైక మార్గం ఇస్లాం. దాన్ని తెలుసుకోవటానికి మీరు సాయంత్రం మస్జిదుకు రండి" అని అరిగిపోయిన రికార్డులా పదేపదే వేస్తుండేవారు.

విభిన్నంగా మాట్లాడిన ఇస్మాయిల్‌జీ ఆకర్షణ ఇర్ఫాన్ మీర్జాను ఆ సాయంత్రం మస్జిదుకు బయలుదేరేట్టు చేసింది. మీర్జా ఇంటి బయటంతా ఈద్‌పండగలా ఉంది. ఆ రెండు మూడువారాలు ఆ వాడంతా అలానే ఉంటుంది. అంబేద్కర్ జయంతి, మేడే, బుద్ధ జయంతి ఘనంగా జరుపుతారు హన్మకొండ కుమార్‌పల్లి బుద్ధ భవన్‌లో. అక్కడంతా ఎక్కువవ మాలోల్లు ముస్లిములు ఉప్పరోల్లు. పిల్లల క్రికెట్ కేకలు జానప బాణీలు, కంజిర్లడప్పుల చప్పుళ్ళు, గజ్జల మోతలు మీర్జాకి ష్టం. ఇప్పుడవన్నీ చికాకు కల్గిస్తుంటే జల్దీ నడుస్తున్నాడు. ఇల్లు దాటితే బుద్ధభవన్, తోటబడి, కూరగాయల మార్కెట్, చికెన్ మటన్ దుకాణాలు, శిరాపాయా కాల్చేకొలిములు, చేపల మార్కెటు- ఎదురుగా మస్జిద్.

తనిష్టంగా సంవత్సరాల నుంచి తిరుగుతుండే ఆ వాతావరణం

నుంచి తప్పించుకు పోతున్నట్లే నడుస్తూ ఎంతో పాతగా అగుపిస్తున్న తలుపుల ద్వారంగుండా మస్జిద్‌లోకి ప్రథమంగా అడుగు పెట్టాడు. చాలా పెద్దగా, విశాలంగా, బ్రహ్మాండంగా ఉంది. ఆ మస్జిద్ వరంగల్ జిల్లా మర్కజ్. జమాతులన్నీ అక్కడ్నించే జిల్లాలోని మస్జిద్‌లకు బయలుదేరుతాయి. ఆదివారం అక్కడ ఇస్లాం పండితులు బయాన్ ఇస్తారు. మగరిబ్ నుండి యిషా వరకు నమాజీలతో సందడిసందడిగా ఉంటుంది. గుండ్రంగా గుంపులు గుంపులుగా కూర్చుని మషూర చేస్తున్నారు. కొందరు తస్బియత్‌లో ఉన్నారు. ఆ వాతావరణం మీర్జాకు గంభీరంగా, అపరిచయంగా, అసౌకర్యంగా అనిపించింది. ఇంటి కెళ్ళిపోదామని వెనక్కు తిరిగాడు.

తస్బీ లెక్కిస్తూ ఇర్ఫాన్‌ను చూసిన ఇస్మాయిల్‌జీ వెంటనే లేచి సమీపంగా వచ్చి

"అస్సలామలేకుం మీర్జా సాబ్" అని చనువుగా, ఆత్మీయంగా పలకరించి గుండెలకు హత్తుకున్నాడు.

"అర్థరాత్రి దాటాక తెల్లవారకముందే రెండు రకాతుల తహజూద్ నమాజ్ చదివి ఏమి దువా చేస్తే అది నెరవేరుతుంది. ఇది చాలా పవర్‌ఫుల్ నమాజ్. అందరిని చిన్నగా పాదాల దగ్గర తడుతూ లేపు. నమాజ్ పూర్తయ్యాక ఒక ఐదు నిమిషాలు నా దగ్గరకు రా" అని తహారత్ కొరకు వెళ్ళాడు.

ఆ క్షణం ఎంతో సొలేస్‌గా అనిపించింది మీర్జాకు.


మీర్జాను తీసుకుని మస్జిదుకు ఒక మూల ఫంకా కిందకు తీసుకుపోయి, కూర్చోబెట్టి, తనూ కూర్చుని నింపాదిగా మాట్లాడుకున్నారు. మీర్జా గురించి, అతని మానసిక స్థితి గురించి స్థూలంగా అర్థం చేసుకుని, "అన్ని సమస్యలకు పరిష్కారం ఖురాన్. అన్ని రోగాలకు మందు హదీసు. అద్భుతమైన జీవితం ఇస్లాం విధానం. నీ బేచైనీ నాకు సమజయింది. ఒక్కవారం నమాజు చేస్తే చాలు, నువ్వు అన్నివిధాల సెట్ అయిపోతావు. అల్లాను విశ్వసిస్తే చాలు నీ జిందగీని అతను ఎంతో హాయిగా నడిపిస్తాడు. మాజమాత్ ఇక్కడ ఉన్నన్ని రోజులు వుజూ, నమాజ్ నేర్చుకో. నీ ఆలోచనా విధానం ఇస్లాం ప్రకారం మార్చుకో. ఖుదాకు భయపడు. అంతే. అన్నీ వాటంతట అవే సవ్యంగా మారిపోతుంటాయి. పదపద యిషాకు టైమయింది. పోయి జమాత్‌తో నమాజ్‌లో నిలబడు." అని ఇర్ఫాన్ మీర్జాతో చెప్పేసి తెల్లటి పొడుగాటి గడ్డాన్ని నిమురుకుంటూ వుజూఖానా వైపు నడిచాడు ఇస్మాయిల్ మౌలా. మీర్జాకు పాతికేళ్ళుంటాయి. మొఖం ఒత్తిడి రాక్షసి కోరల్లో చిక్కుకున్నట్లు ఎంతో దైన్యంగా మిణుకు మిణుకుమంటూ ఉంది. ఇస్మాయిల్‌జీకు రెండు పాతిక లుంటాయి. ఎంతో ప్రశాంతంగా పున్నమి చందమామలా వెలిగిపోతు న్నాడు. మీర్జా మొట్ట మొదటిసారి మస్జిదుకు వచ్చాడు. అదీ. అల్లా మీది భక్తితోనో భయంతోనో కాదు. మనస్సు పెట్టే హింస నుంచి బయటపడటానికి మస్జిదు దోహదపడుతుందేమోనని ఒక చిన్ని ఆశతో వచ్చాడు.

ఇస్మాయిల్‌జీ మాటలు విన్నాక, ఇమామ్‌తో నమాజు చదివాక మనస్సు తేలికపడి కొంత ఆశ కల్గింది. మశీదంటే ఉన్న భయం పోయి, అదొక మెడిటేషన్ హాల్‌లా కనిపించింది. ఇస్మాయిల్‌జీ జమాత్‌తో కొన్నిరోజులు గడపాలని అనిపించింది. ఆ రాత్రి మస్జిద్‌లోనే పడుకున్నాడు. తెల్లవారకముందే పాదాల దగ్గర, ఎవరో చిన్నగా తడుతూ "మీర్జా... మీర్జా" అంటుంటే కళ్ళుతెరచి చూసాడు. కాళ్ళ దగ్గర ఇస్మాయిల్‌జీ నిలబడి ఉన్నాడు. ధన్‌మని లేచి కూర్చున్నాడు.

"అర్థరాత్రి దాటాక తెల్లవారకముందే రెండు రకాతుల తహజూద్ నమాజ్ చదివి ఏమి దువా చేస్తే అది నెరవేరుతుంది. ఇది చాలా పవర్‌ఫుల్ నమాజ్. అందరిని చిన్నగా పాదాల దగ్గర తడుతూ లేపు. నమాజ్ పూర్తయ్యాక ఒక ఐదు నిమిషాలు నా దగ్గరకు రా" అని తహారత్ కొరకు వెళ్ళాడు. అతను చెప్పినట్లే మీర్జా అందరిని చిన్నగా తట్టి నిద్ర నుంచి మేలు కొలిపి, నమాజ్ చదివాక అతని చెంతకు వెళ్ళాడు.

"చూడు మీర్జా! నేను చనువుతో కొన్ని విషయాలు నీకు చెప్తాను. పరిచయమైన రోజే ఇలా మాట్లాడినందుకు కోపం తెచ్చుకోకు. సహృదయంగా అర్థం చేసుకుంటావనుకుంటాను. ఎందుకంటే ఎంతో చిన్న విషయాలైన, ముఖ్యమైన విషయాలే నీకు తెలవ్వు అని ఈ ఒక్క రాత్రిలోనే నాకు తెలిసిపోయింది. నువ్వు నిలబడి మూత్రంచేసి, శుభ్రం కూడా చేసుకోలేదు. ఎంత చిన్న విషయమది నీకు. కాని ఇస్లాంలో చాలా ముఖ్యమైన విషయం. కూర్చుని పోసుకుని, నీళ్ళు లేకుంటే కనీసం ఇటుకతోనో పెంకుతోనో అద్దుకోవాలి. కనీసం వుజూ చేయటం కూడా రాదు నీకు. ఇటువంటి విషయాలు ఇస్లాంలో చాలా ఉన్నాయి. అదొక అద్భుత ప్రపంచం. ప్రశాంత జీవనం. నువ్వున్న విపరీతమైన మానసిక స్థితిలో మంచిగా బయట పడగలవు. కాబట్టి నువ్వు ఒక ఛిల్లా చెయ్యి. అంటే 40 రోజులు ఇంటికి దూరంగా మస్జిదుల్లో నమాజ్ ఇస్లాం నేర్చుకోవాలి. నా జమాత్‌కు ఇంకో ఇరవై రోజుల్లో ఛిల్లా అయిపోతుంది. ఈ ఇరవై రోజులు మాతో ఉండు. స్పెషల్‌కేస్‌గా నిన్ను చేర్చుకుంటాను. పోయేప్పుడు ఇంకో జమాత్‌లో చేర్పిస్తాను. వాళ్ళతో 20 రోజులు చెయ్యి. ఛిల్లా అయిపోతుంది. అప్పుడు చూసుకో నువ్వు ఎంత ఆరోగ్యాన్ని పొందుతావో! ఎంత నిదానంగా, ఉత్సాహంగా, ప్రశాంతంగా ఉంటావో!" అని చెప్పేసి నాస్టా, చాయ్ తయారుచేస్తున్న కిద్మత్ డ్యూటీ వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. అతని జమాత్ లో మొత్తం ఇరవైమంది ఉన్నారు.

ఇర్ఫాన్ మీర్జా ఆలోచనలో పడిపోయాడు. ఇస్లాం, అల్లాల గురించి ఆలోచించిన మనిషి కాడు. ఆ అవసరమూ రాలేదు. ఆ కుతూహ లమూ లేదు. అల్లా ఉంటే నాకేమిటి, లేకుంటే నాకేమిటి, ఆ విషయం నాకనవసరం, అప్రస్తుతం అనుకునేవాడు. జన్నత్ జహు న్నమ్, పాపపుణ్యాల మీద నమ్మకం లేదు. ఇతరులకు హాని కల్గించ కుండా మనం ఎట్లా అయినా జీవించవచ్చు అనేది అతని తాత్వికత. అతని జీవితం ఇప్పటిదాకా అలానే సాగింది. కాని ఈ మహబ్బత్ లో చిక్కుకున్నాక బయటపడలేకపోతున్నాడు. తన శక్తిమేరకు చేయాల్సినవన్నీ చేసాడు. సుకున్ మాట అటుంచి, మామూలు మనిషిగా కూడా ఉండలేకపోతున్నాడు. అందుకని జమాత్‌తో ఉండి పోవాలని నిర్ణయించాడు. మరుసటి దినం జమాత్ పసర అనే ఊరు చేరింది. పసరలో బస్సు దిగిన వెంటనే గుండ్రంగా నిలబడి దువా చేసారు. ఊరి జనం



వారిని చూస్తూ ఏదో చిన్నగా మాట్లాడుకున్నారు. దువా ఒక్కోరు ఒక్కోవిధంగా చేస్తారు. అప్పుడు చేసిన తను అన్ని విషయాలు దువా చేసాడు. ఒకతను వెక్కివెక్కి ఏడుస్తూ చాలా ఉద్వేగంగా చేస్తాడు. దువా తర్వాత మశీదు అక్కడ తహారత్‌కు పోవటానికి కూడా సదుపాయము లేదు. అందరూ కలసి అప్పటి కప్పుడు షండ్లాస్‌ను ఏర్పాటుచేసారు. గుంట తవ్వి రెండు బొంగులు కూర్చునే వీలుగా గుంటపైన పెట్టి చుట్టూ గోనెసంచులు కట్టారు. వుజూ చేసుకుని మస్జిదు లోనికి అడుగుపెట్టిన వెంటనే దొరకాత్ ఘనురానా నమాజ్ చదివారు. వంట చేసుకుని తిని కొంతసేపు విశ్రమించారు. జమాత్‌మే బహుత్ ఆరామి మిలతీ. మస్జిదు విశ్రాంతి మనిషిని శక్తిమంతం చేస్తుంది. జమాత్ పస్రాలో పది రోజులు పనిచేసింది. మస్జిదు దాటాక కొంతదూరం నుంచి పొలాలు షురూ. అవి దాటితే గోదావరి నది పారుతుంటుంది. అక్కడ్నించి దండకారణ్యం మొదలు. పచ్చటి చేలు, జల జలసాగే నదీ ప్రవాహం, పొద వాటిచెట్లతో నిండిన అడవి చూడాలని, వాటిమధ్య కొంత సమయం గడపాలని ఇర్ఫాన్ ప్రాణం విలవిలా కొట్టుకుంది. అమీర్ సాబ్‌తో కూడా ఆ విషయం ప్రస్తావించాడు. అందరం నడుచుకుంటూపోయి, చూసి, నడుచుకుంటూ వద్దామని అన్నాడు.



"జమాత్‌లో ఉన్నప్పుడు మనస్సును వేరే విషయాల మీదకు పోకుండా జాగ్రత్తపడాలి. వజూ చేయటం నమాజ్ చదవటం నేర్చుకోవాలి. సూరాలు బట్టీపట్టాలి. ఖురాను, హదీస్‌లో రాసిన విషయాలు విని, చదివి తెలుసుకోవాలి. నేర్చుకోవటం, నేర్పించటం జమాత్ లక్ష్యం. మస్జిదుకు రమ్మని దావత్ ఇవ్వాలి. జమాత్‌లకు బయలుదేరమని మనవి చేయాలి. అల్లా ధ్యానంలో ఉండాలి. దీన్‌కాకామ్ చాలా ఉంటుంది. కనుక మన ఏకాగ్రత చెదరకూడదు. మరీ ముఖ్యంగా మనం ప్రకృతి గురించి, స్త్రీ గురించి ఇతర సంస్కృతుల గురించి ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఔరత్‌బీచ్ దరియామే చోడ్‌దేతీ. మనల్ని విచ్ఛిన్నం చేసే బలీయమైన శక్తులవి."

**నీ చూపుల ఆత్మీయత, నీ మాటల స్వచ్ఛత, నన్ను ఇంప్రెస్ చేసే నీ రిస్కులు, నా సౌందర్యాన్ని పొగిడే నీ కళాత్మకత నన్ను వివశురాల్ని చేసాయి. నీమీది ప్రేమను దాచుకోలేక గిజగిజ తన్నుకుంటున్నాను. గుండెలో బాణం గుచ్చుకున్న పావురం నాకన్నా మేలు. ఈ హింసను భరించలేని నిస్సహాయురాల్ని. నిన్ను ప్రేమించకుండా ఉండలేను. అందుకే నీ ప్రేమలో అన్నివిధాలుగా కరిగిపోయాను.**

అమీర్ సాబ్ మాటలు మీర్జాను బాగా నిరుత్సాహపరిచాయి. అదును చూసి చెప్పాపెట్టకుండాపోయి రావాలని అనుకున్నాడు. అయితే అనుకోకుండా అమీర్ సాబ్ అనుమతితోనే పోయే అవకాశం ఇంతలోనే వచ్చింది. ఒక రైతు ముసల్మాను ఇంటి దగ్గర జమాత్‌కు దొరకటం లేదు. ఫజర్‌కన్నాముందే పొలానికి పోతున్నాడు. మగరిబ్ అయ్యాక వస్తున్నాడు. అందుకని అమీర్ సాబ్ మీర్జాను, ఇంకోతన్ని రెండు సైకిళ్లిప్పించి పొలానికి పంపాడు. ఇద్దరూ పోయి అతన్ని మశీదుకు రమ్మని చెప్పి వచ్చారు.

ఇంతలోనే జరగాల్సిన ఘోరం జరిగి పోయింది. ప్రకృతిలో ప్రేయసి గుర్తొస్తుంది. ఇర్ఫాన్ మీర్జా మనస్సు అదుపు తప్పింది. మనిషి ఎట్లనో అయిపోయాడు. ఇస్మాయిల్‌జీ విషయాన్ని పసిగట్టాడు. ఇషా తర్వాత ఇర్ఫాన్‌ను దగ్గరకు పిలిచి జమాతులు వలన మనుషుల మనసులు ఎలా గొప్పగా ప్రభావితం అవుతాయో చెప్పసాగాడు.

"షరీఫ్ విపరీతంగా తాగేవాడు. రోడ్లమీదనే పడిపోయేవాడు. ఏ అర్ధరాత్రో వాళ్లింట్లో వాళ్ళు వెతుక్కుంటూ వచ్చి శవంలా ఇంటికి మోసుకుపోయేవాళ్ళు. ఒక ఛిల్లాకు వచ్చాడు. అంతే. మందు ముట్టుకుని పది సంవత్సరాలయింది.

గాలిబ్ భార్య అందం అద్భుతం. అయినా అతనికి రోజుకు ముగ్గురు ఆడవాళ్ళు కావాలి. ఒక ఛిల్లాకు వచ్చాడు అంతే. ఇప్పుడు అత నంత మంచిగా సంసారం చేసుకునే మనిషి ఇక్కడి ఏ మొహల్లాలోనూ లేడు.

ఇంకోతను అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఛిల్లా తరువాత ఎంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. జమాత్ అంటే ఛల్తాపిర్తా మదర్సా. ఇస్లాం ఆధ్యాత్మికతను నేర్పేది. అల్లాతో బంధం తెగిన బందేలను అల్లాతో లింకు కలిపేది. ఇహలోకంలో, అల్లా ప్రపంచంలో రెండింట ప్రయోజనము కల్గించే ఈ జమాత్‌ను సద్వినియోగం చేసుకో" అలా చాలాసేపు చెప్పి ఇస్మాయిల్, ఇర్ఫాన్ మొఖంలోకి చూసాడు. ఎంతో నిర్లిప్తంగా ఉన్నాడు. ఇప్పటివరకు చెప్పిన విషయాల్లో ఒక్క విషయం కూడా బుర్రలోకి ఎక్కినట్లు అనిపించలేదు. ఇస్మాయిల్ ఆలోచనల్లోపడ్డాడు. పూర్తి నిరుత్సాహం ఆక్రమించుకుంది. అల్లాను ఇస్లాంను యకీన్ చేసినవానికి సమస్య ఉండదు. అదొక అద్భుతమైన ఆధ్యాత్మిక రాస్తా. ఆ బాటలో అశాంతే ఉండదు అని ఇస్మాయిల్‌జీ దృఢవిశ్వాసం. కాని ఇర్ఫాన్‌మీర్జా విషయంలో అది అతకడంలేదు. ఇర్ఫాన్‌ను ఎప్పుడు సన్నిహితంగా పరిశీలించినా అతను అప్రశాంతంగా కనిపించేవాడు.

ఈ విషయం వివరంగా అర్థం కావాలంటే ఉమామహేశ్వరి పాత్ర గురించి తెలుసుకోవాలి. గత మూడు సంవత్సరాల మీర్జా మహేశ్వరిల మొహబ్బత్ గురించి తెలుసుకోవాలి.

## దో

షట్‌సల్వార్‌లు వేసుకునే ఉమామహేశ్వరి మొట్టమొదటి సారి ఆ సభలో చీరకట్టుకుంది. చీరలో ఆడవాళ్ళు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తారు. నీలంరంగు చీర మీద తెల్లటి చిన్నిచిన్ని చమ్కీలు. సముద్రం మీద తారల ఆకాశాన్ని పరచినట్లుంది. సముద్రాకాశంలో ఉమా మహేశ్వరి చాంద్‌లా మిలమిల మెరిసిపోతున్నది. నడుస్తుంటే నిలువెత్తు పసిడి కదులుతున్నట్లుంది. ఆమెను చూసిన మరుక్షణం ఇర్ఫాన్ మీర్జాలో ఒక మధురానుభూతుల తుఫాను. అది దినదినానికి పెరుగుతూ పెరుగుతూ పెనుతుఫానుగా మారిపోయింది.

ఉమామహేశ్వరి ఇర్ఫాన్ మీర్జా ? కే ఆఫీసులో కొత్తగా చేరి ఒక సంవత్సరకాలం గడిచింది. గ్రాడ్యుయేషన్ పూర్తవగానే ఇద్దరికి ఉద్యోగం వచ్చింది. ఒకటే సెక్షనులో చేసారు. చూసుకుంటూ, మాట్లాడుకుంటూ, కలసి భోంచేస్తూ సన్నిహితంగా మెలిగేవారు. వారిద్దరి మూడుసంవత్సరాల ప్రొబెషనరి పీరియడ్ అయిపోయింది. ఆ కాలంలో మీర్జా మహేశ్వరికి మూడు వందల ప్రేమలేఖలు రాసాడు. ఆమె మాత్రం జవాబుగా మూడంటే మూడే రాసింది. ఆ మూటి సారాంశం ఏమంటే-

'ఎందుకు ఈ ఉమంటే నీకంత పిచ్చి. నీ నుంచి ఎంతదూరంగా పారిపోవాలని ప్రయత్నిస్తున్నానో, నువ్వంత దగ్గరగా వస్తున్నావు. నీకు ఇవ్వనిది నా దగ్గర ఇంకేమి మిగిలిందని. నువ్వు ఉద్వేగాల మనిషివి. నీ మతం వేరు. మగవారిని నమ్మలేని గతం నాది. మనం తూర్పు పడమరలం.

అయినా నీ చూపుల ఆత్మీయత, నీ మాటల స్వచ్ఛత, నన్ను ఇంప్రెస్ చేసే నీ రిస్కులు, నా సౌందర్యాన్ని పొగిడే నీ కళాత్మకత

నన్ను వివశురాల్ని చేసాయి. నీమీది ప్రేమను దాచుకోలేక గిజగిజ తన్నుకుంటున్నాను. గుండెలో బాణం గుచ్చుకున్న పావురం నాకన్నా మేలు. ఈ హింసను భరించలేని నిస్సహాయురాల్ని. నిన్ను ప్రేమించకుండా ఉండలేను. అందుకే నీ ప్రేమలో అన్నివిధాలుగా కరిగిపోయాను. ఈ జీవితానికి సరిపడేన్ని అనుభూతులు అనుభవాలు నీ సాన్నిహిత్యంలో పొందాను. కాని ప్రేమ పెండ్లి నాకు, నా ఆలోచనలకు, నా మనస్తత్వానికి సరిపడవు. పైగా నాకు పెళ్ళికాని ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. కాని నువ్వు నన్ను వదిలేలా లేవు. అందుకే నేను నీకు కనిపించనంత దూరం వెళ్ళిపోతున్నాను. అక్కడ నా జీవితం నేను జీవిస్తాను. ఇంకెవరినన్నా పెండ్లి చేసుకుని నీ జీవితం నీవు జీవించు." దానితో మీర్జా ప్రేమ అందినట్లే అంది అందకుండా పోయింది. అందీ అందని ప్రేమ, దొరికినట్లే దొరుకుతూ ఇంతలోనే జారి పోతుండే ప్రేయసి ప్రియుడికి మహా నరకం.

విరహం అదే జుదాయి ఎంత బాధను కల్గించిందో మీర్జా తన డైరీలో రాసుకున్న కవితాత్మక వాక్యాలు చదివితే తెలుస్తుంది.

"అదొక ఉప్పొంగే సముద్రమంత కెరటం. సృష్టి సమస్తాన్ని క్షణంలో మింగే జల్‌జలా. మనిషిని అమాంతం గటుక్కుమనిపించి బొమికల్తో సహా విరిచే చిలువ. భగభగ కాలి ధగధగ మెరిసి బూడిదయ్యే అలావా. హృదయాన్ని మంచుముక్కను చేసి మాయం చేసే సూర్యగోళం. గుండెను ఖీమా చేసే పదునైన ఛురా న్యూటానుల్ని బూటానుల్ని ఛిన్నాభిన్నం చేసి మెదడును వర్కుషాపుకు పంపటం. మనమొత్తం నరాల్ని తాడులా పేనుకుని మనకు మనం బిగించుకునే ఫాసీ. పోస్టుమార్టం టేబిల్‌పైన సజీవంగా కట్టి పడేయటం. ఖబర్‌స్తాన్ బొందలో నూకి పైనుంచి మన్నుబోస్తుంటే కేకేయటం. వాన పుడమితో పోరలు సీకాట ఆడుకున్నట్లు తడి గుండెను సన్నసలాకుతో పొక్కలు చేయటం. జీవంతో కదులు తున్నట్లుగా శవంలా మారిపోయుండటం."

"ప్రేమ ఒక అగ్ని.
అది దహిస్తూ మనిషిని
ఉన్నతుణ్ణి చేస్తుంది. బాధను
నిరాకరించేవాడు, ప్రేమను స్వీకరించలేడు.
మనిషికి ప్రేమ ఒక వరం. ప్రేమ
సాఫల్యతకు మించిన శాపం మరొకటి లేదు.
ప్రశ్నలు మెదడుకు సంబంధించినవి. స్పందనా
కేంద్రం హృదయం. దాన్ని పొదుగు
నిరంతరంగా, గుడ్లుపొదిగే తల్లి కోడి మాదిరి.
ఆ తపస్సు నుంచి ఏం వస్తుందో చూడు.
లోకపు విలువల నుంచీ,
గొప్పతనాల నుంచి పూర్తిగా
నగ్నమైపో-"

* * ** **

ఉమామహేశ్వరి ఉమామహేశ్వరి ఉమామహేశ్వరి అదే జపం.

చెట్టును చూసినా మొక్కను చూసినా పువ్వును చూసినా ఫైలు తెరచినా సముద్రాన్ని చూసినా పున్నమిని చూసినా, సినిమాల్లో ఏ నాయికను చూసినా ఉమామహేశ్వరి రూపమే.



ఇర్ఫాన్ మీర్జాకు ఆ స్థితి అదృష్టమో దుర దృష్టమో అర్థంకావటంలేదు. భయంకరమైన, అమితమైన ఒత్తిడి మాత్రం మనస్సు మీద ఉంటున్నది అని ప్రతిక్షణం అనుభవంలోకి వస్తున్నది. పిచ్చిపడ్తున్నట్లు, క్రమేణ పెరుగు తున్నట్లు తెలుస్తున్నది. తనకు స్పృహ లేకనే ఒక కాలో చేయో తరచుగా కదులుతూ ఉంటు న్నది. ఎదుటివాళ్ళు చెప్తున్నది వినిపించటం లేదు. వినిపించినా అర్థంకావటం లేదు. అపరిమితంగా తింటున్నాడు. ఒక్కోసారి ఏమీ తినటంలేదు. ఏ విషయం పట్లా ఆసక్తి, ఇష్టం ఉండటంలేదు. తన ప్రేమ పిచ్చిల గురించి బయటకు చెప్పటం ఇష్టం లేదు. కాని భయం భయంగా ఉంటున్నది. మిత్రుల చెంతకుపోయి తాత్విక విషయాలు, మానసిక శాస్త్రాల గురించి మాట్లాడుకుంటే కొంతసేపు కొంత శాంతిగా అనిపించేది. ఇంటికి రాగానే తిరిగి మామూలు. జుదాయి మనస్సును విపరీతంగా విశృంఖలంగా ప్రవర్తించమంటుంది.

బయటకు పోతే చాలు నేరుగా పాన్‌డబ్బా దగ్గరకు పోయేవాడు వరుసగా రెండు కింగ్‌సైజ్ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు రెండు నిముషాల్ల కాల్చేవాడు. ఓ ఐదు నిముషాలన్నా అవకముందే ఇంకో రెండు. అల ఓ రెండు గంటల్లో రెండు పెట్టెలు ఊది పారేసేవాడు. గుం కుంపటిలా మండుతుండేది. నాలుక మొద్దుబారింది. నోరంత కంపుకంపు. ఆకలిదాహం స్పర్శ స్పందన ఏవీలేకుండా పోయాయి క్రమేపి మందుకు అలవాటైపోయాడు. రెండు సంవత్సరాల నుంచి ఇదే నరకం. ఎలా బయటపడాలో తెలీ గిజగిజ తన్నుకు ఛస్తున్నాడు. నరనరాన ముక్తి ఆక్రందన.

నిప్పుకణికలను మింగుతున్నట్లు, అగ్ని వర్షంలో తడుస్తున్నట్లు, నిప్పురవ్వల దేహాన్ని బాదుతున్నట్లు బాధ. హింస.

## తీన్

అదీ ఉమామహేశ్వరి విషయం. మస్జిదు వాతావరణంలో మరచానను కున్న మహేశ్వరిని నది నీళ్ళు, అడవి చెట్లు కదిలించాయి. మహేశ్వరి గుర్తొస్తే మనస్సు విపరీతం, అసంగతం అయి పోతుంది మీర్జాకు. మైండంతా ఫ్రీజ్ అయి పోతుంది. ఏదో ప్రపంచంలో ఉన్నట్లుంటాడు. మామూలుగా ప్రవర్తించడు. జమాత్ నుంచి ఎవరికీ చెప్పాపెట్టకుండా మండుటెండలో ఐదు గంటలు నడుచుకుంటూ హన్మకొండ చేరాడు. ఎట్ల నడిచిందో తెలియదు. ఒక కాలి చెప్పు బాగా కొరుకుతున్నది. రక్తం, పెద్ద గాయం అవుతున్నది. ఆ స్పృహ కూడా లేకుండా ఇంటికి చేరుకున్నాడు.

మెదడు నరాల్ని నారపేనినట్లు, కాళ్ళు చేతులు ముక్కలు కొట్టి కొలిమి నిప్పుల్లో పడేసినట్లు, గునపానికి తలకాయ గుచ్చి కాలుస్తున్నట్లు అన్పించసాగింది. స్వామన్ననుంచి వచ్చిన ఉత్తరం మనసును తేలికపరచి, ఎంతో నిబ్బరాన్ని కల్గించింది. 'ప్రేమ ఒక అగ్ని. అది దహిస్తూ మనిషిని ఉన్నతుణ్ణి చేస్తుంది. బాధను నిరా కరించేవాడు, ప్రేమను స్వీకరించలేడు. బాధ నుంచి బయటపడే ప్రయత్నం చేస్తే మనసుకు ఆ ప్రేమ కూడా దూరమై మొద్దుబారి పోతుంది. ప్రేమకూ బాధకూ అంత లంకె. బాధపడాలి. అంతే. హృదయంలో బాధాస్పందనను గమనిస్తూ కూర్చోవడం ఒక గొప్ప మెడిటేషన్. బాధలో మునిగిపోవడం కంటే మనిషి చేసే ఘనకార్యం మరొకటి ఏదీ లోకంలో లేదు. అగ్నిని వరంగా పొందిన మనిషి ధన్యుడు. హృదయంలో నుంచి బాధ విడుదల అవుతూ ఉండటం కూడా ఒక గొప్ప ఎనర్జీ. ఆ బాధనుంచే ఆధ్యాత్మిక లోకాలు వికసిస్తాయి. దృఢమైన మనస్సు అంటే ప్రేమకూ బాధకూ హృదయస్పందనలకూ మొద్దుబారిపోవడం కాదు. చాలా నరకంగానూ, చాలా ఆనందంగానూ ఉండటమే జీవశక్తికి దాఖలా. ఒక విషయం కోసం అన్ని విషయాలను సన్యసించడం ధ్యానం. మనిషికి ప్రేమ ఒక వరం. ప్రేమ సాఫల్యతకు మించిన శాపం మరొకటి లేదు. ప్రశ్నలు మెదడుకు సంబంధించినవి. స్పందనా కేంద్రం హృదయం. దాన్ని పొదుగు నిరంతరంగా, గుడ్లుపొదిగే తల్లి కోడి మాదిరి. ఆ తపస్సు నుంచి ఏం వస్తుందో చూడు. లోకపు విలువల నుంచీ, గొప్పతనాల నుంచి పూర్తిగా నగ్నమైపో-"

**ఖతమ్**